క్లుప్తంగా

వైభవంగా సర్వమంగళదేవి పూజ



భక్తురాలికి అమ్మవారి ప్రతిమను అందజేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో సర్వమంగళదేవి పూజలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. పూజా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంజునాథ సుధాకర్, సులోచన మాట్లాడుతూ ప్రతినెల 19 వ తేదీన 18 శక్తి పీఠాలకు సంబంధించిన అమ్మవార్ల అలంకారాలు, పూజలు ఉంటాయన్నారు. పూజా కార్యక్రమంలో 60 మంది మహిళలు పాల్గొనగా వారికి చీటీలు ఇచ్చి డిప్ తీయగా దియ్యాల మంజుల పేరు రావడంతో ఆమెకు అమ్మవారి ప్రతిమ, ప్రసాదాలు అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలల అక్రమాలను నిరోధించండి

పోరుమామిళ్ల : మండలంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నాయని, వెంటనే వాటిపై చర్య తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రత్నస్వామికి వినతిపత్రం ఇచ్చారు. సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అభిలాష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నాయన్నారు. స్మార్ట్, టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల్లో దండుకుంటున్నారన్నారు. ప్రైవేటు స్కూళ్ల అక్రమాలను నిరోధించడానికి జిల్లా స్థాయిలో అధికారులు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులతో కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సురేంద్ర, రామకృష్ణ, చంద్ర, రమణ పాల్గొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా కుంచం

ప్రొద్దుటూరు : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర గౌరవ సలహాదారుడుగా కుంచం వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారని సొసైటీ ప్రెసిడెంట్ వై.సురేంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కుంచం మాట్లాడుతూ రెడ్ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఈ ఏడాది 6 నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్స్‌పాల్ అనంత పద్మనాభమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 65 ఖాళీలు, 7వ తరగతిలో 53, 8వ తరగతిలో 50, 9వ తరగతిలో 49 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అలాగే నాబార్డు న్యూ పాఠశాలలో 6వ తరగతిలో 77 ఖాళీలు, 7వ తరగతిలో 67, 8వ తరగతిలో 66, 9వ తరగతిలో 56 ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులు జులై 3వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షలో పాల్గొనాలన్నారు. సమాచారం కోసం 8309399624 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



పసుపు కొనుగోళ్ల వివరాలను తెలుసుకుంటున్న జేసీ గణేష్ కుమార్

మైదుకూరు : మైదుకూరులోని పసుపు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డిని కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న పసుపు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 500 టన్నుల పసుపు పంటను రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు ఈ సందర్భంగా డీఎం జేసీకి వివరించారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం ఎంపికలు

మైదుకూరు : కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగు, ఐదు తరగతుల ప్రవేశం కోసం బుధవారం మైదుకూరులో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ పద్మలత తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు ఈ ఎంపికలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. 4వ తరగతి ప్రవేశానికి 1-8-2014 నుంచి 31-7-2015లోపు జన్మించిన వారు, ఐదో తరగతి ప్రవేశానికి 1-8-2013 నుంచి 31-7-2014 మధ్య జన్మించి ఉన్న వారు అర్హులని ఎంఈఓ వివరించారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన రోజు సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, స్కూల్ డైస్‌కోడ్, చైల్డ్ ఐడీ వివరాలతో రావాలన్నారు. ఎంపికలో ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, 800 మీటర్ల పరుగు పందెం, 6 ఇంటు 10 మీటర్ల సెటిల్‌రన్, మెడిసిన్ బాల్ పుట్ ఆటల్లో పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తారని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి సచివాలయాల ద్వారా అందజేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు సచివాలయ పరిదిలోని రెడ్డిపల్లి, రెడ్డిపల్లి ఎస్సీ, బీసీ కాలనీలలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవరత్నాలలో భాగంగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి నేరుగా ఇంటికి వెళ్లి అందజేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్న మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జున రెడ్డి, జేఏసీ మండల కన్వీనరు మల్లికార్జునరెడ్డి, రెడ్డిపల్లి సర్పంచు నాగం నరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రెడ్డెయ్య, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మినరసారెడ్డి, లక్ష్మిరెడ్డి, దున్నూతల రాజారెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా సిబ్బంది నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయ సెక్రటరీలు, ఆయా వార్డుల వాటర్ బాయ్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో బద్వేలు మున్సిపాలిటీకి మంజూరైన బృహత్తర తాగునీటి పథకం వలన పట్టణంలో ఎక్కడా నీటి సమస్య లేదని, అయితే కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం వలన ఆయా వార్డుల్లో సకాలంలో నీరు పంపిణీ కావడం లేదన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఆయా వార్డులకు కేటాయించిన సమయానికి నీటిని విడుదల చేయాలని కోరారు. అలాగే కొన్ని వార్డుల్లో నీటి సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరారు. కొన్ని వార్డుల్లో నీరు వృథాగా పోతుందని ఫిర్యాదులు వస్తున్నాయని, నీరు వృథా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు దీప్తి, జగదీష్, కౌన్సిలర్లు సత్యం, కరీముల్లా, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు పుత్తా శ్రీరాములు, శివయ్య, రఘురామిరెడ్డి, మౌలాలి, సుబ్బరాజు, నరసింహులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు

అట్లూరు ఎంఈఓగా ఖాదర్‌వలి

అట్లూరు : అట్లూరు మండల విద్యాశాఖ అధికారి-2గా ఖాదర్‌వలి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గాలివీడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై అట్లూరుకు బదిలీపై వచ్చారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన రత్నస్వామిని మంగళవారం ఉపాధ్యాయ సంఘాలు సన్మానించాయి. రత్నస్వామి విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని, ఉపాధ్యాయుల మన్ననలు పొందాలని రెండు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓ మస్తాన్‌వలి

కలసపాడు : కలసపాడు మండల నూతన విద్యాశాఖాధికారి - 2 గా బాధ్యతలు చేపట్టిన మస్తాన్‌వలిని మంగళవారం ఎస్టీయూ మండల శాఖ నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈయన గతంలో కాశినాయన మండల ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేశారు. ఎగువ రామాపురం జెడ్పీహెచ్‌ఎస్, శంకవరంలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటరెడ్డి, శివారెడ్డి, వినోద్, జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపాళెం మండల ఎంఈఓ-2గా రామస్వామిరెడ్డి

రాజుపాళెం : రాజుపాళెం మండల విద్యాశాఖ అధికారి-2గా రామస్వామి రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో భాగంగా ఇదే మండలంలోని టంగుటూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామస్వామి రెడ్డి ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు ఎర్రగుంట్ల మండలం ఎంఈఓ-2గా బదిలీ అయ్యారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు ఎంఈఓ-2గా ఎ.శోభారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడపలో డీసీఈబీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమె ప్రొదుటూరు ఎంఈఓ-2గా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎంఈఓ-1 సావిత్రమ్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ- 2గా జి. వెంకటేశ్వర్లు

బ్రహ్మంగారిమఠం : బి.మఠం ఎంఈఓ -2గా జి. వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముద్దనూరు జెడ్పీహైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంఈఓగా బి.మఠంకు వచ్చారు. వెంకటేశ్వర్లును బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు లెక్కల కొండారెడ్డి, బాలగురవయ్య, మహిళా ఉపాధ్యాయులు సన్మానించారు.

ఎంఈఓ-2గా సగిలి భాస్కర్

దువ్వూరు : దువ్వూరు మండల విద్యాశాఖాధికారి -2గా సగిలి భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిలంకూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేశారు. ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులను కల్పించేందుకు దోహదం చేస్తానని పేర్కొన్నారు.

ఎంఈఓగా నిర్మల

కాశినాయన : ఎంఈఓ - 2 గా ఓ.నిర్మల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందాల్సిన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆమెను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో ఈనెల 25న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, 13 విభాగాల్లో బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజనల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9440223908కు సంప్రదించాలని కోరారు.

అవధాని నరాల రామారెడ్డికి సత్కారం



నరాల రామారెడ్డిని సత్కరిస్తున్న శివచంద్రారెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ అవధాని నరాల రామారెడ్డిని ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి సత్కరించారు. నాటా మహాసభలలో పాల్గొననున్న సందర్భంగా ఆయనను శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సమితి ఆధ్వర్యంలో జూన్ 30, జులై 1, 2 తేదీలలో నాటా మహాసభలు డాలస్ నగరంలో జరుగనున్నాయని 'హృద్యం-తెలుగుపద్యం' అనే అంశంపై నరాల ప్రసంగించనున్నారన్నారు. ప్రొద్దుటూరు ఖ్యాతిని నలు దిశలా చాటిన అవధాని నరాల అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, మూలె రామమునిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : నాటా మహాసభలకు వెళ్లనున్న ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డిని ప్రొద్దుటూరు వాకర్స్ అసోసియేషన్ వారు మంగళవారం సన్మానించారు. ఉత్తర అమెరికా డల్లాస్‌లో ఈనెల 30, జూలై 1, 2 తేదీల్లో జరగనున్న నాటా మహాసభల్లో నరాల రామారెడ్డి పాల్గొననున్నందున ఆయనకు ఆత్మీయ సన్మానం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సాము గోపాలకృష్ణ, అధ్యక్షులు ఏరువ లక్ష్మిరెడ్డి, జనరల్ సెక్రటరీ కాకర్ల రమేష్, ట్రెజరర్ డీకే సతీష్, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ మూలె రామమునిరెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్

కడప అర్బన్ : కడప కేంద్రకారాగారంలో వున్న ఖైదీలందరూ మూడు రోజుల పాటు దీర్ఘకాలిక వ్యాధులకు నిర్వహించే వైద్య పరీక్షలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వల్లీ ఆధ్వర్యంలో కడప కేంద్రకారాగారంలో వున్న ఖైదీలందరికీ దీర్ఘకాలిక వ్యాధులైన హెపటైటిస్-బి, -సి, సిఫిలిస్, హెచ్‌ఐవి, టి.బి పైన అవగాహనతో పాటు, వైద్య పరీక్షలను ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఖైదీలకు దీర్ఘకాలిక వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కడప కేంద్రకారాగారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఖైదీలందరూ పరీక్షలను తప్పక చేయించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు.

యోగ సాధనతో ప్రయోజనాలు

వైవీయూ : యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సన్నాహక శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం కళాశాలలో యోగ శిక్షణ నిర్వహించారు. యోగ గురువు ఆదినారాయణ ఆసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో డా. అంకాల్ నాగరాజు, డా. వై. సావిత్రి, డా. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25న మాజీ సైనికుల సమావేశం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఎన్జీఓ హోంలో 25న ఉదయం 9 గంటలకు మాజీ సైనికుల సమావేశం జరగనున్నట్లు మాజీ సైనికుల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బాలవీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కడప నుంచి సైనిక సంక్షేమ కార్యాలయ అధికారులు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సభ్యత్వం ఉన్న సభ్యులేగాక లేని వారు కూడా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు మండల స్థాయి క్రీడాపాఠశాల ఎంపికలు

దువ్వూరు : వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 9 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సెల్ నంబర్ 9052727578కు సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం



ఉపాధి పనుల వివరాలను వివరిస్తున్న ఎంసీసీ సభ్యులు

మైదుకూరు : మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై మంగళవారం ఓపెన్ ఫోరం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి సమక్షంలో ఎంసీసీ సభ్యులు ఉపాధి పనులపై చేసిన తనిఖీ వివరాలను వివరించారు. కార్యక్రమంలో ఎండీపీఓ రమణారెడ్డి, ఏపీఓ లక్ష్మినారాయణ, పీఆర్ ఏఈమధుసూదన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వుట్టి నాగశయనంను సన్మానిస్తున్న దేవాంగులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో మంగళవారం శ్రీశైలం ఉమా రామలింగేశ్వర దేవాంగ నిత్యాన్నదాన సత్రం కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన వుట్టి నాగశయనంను ఘనంగా సన్మానించారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి నరసింహారావు ఆధ్వర్యంలో వుట్టి నాగశయనంకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు.

పేద పిల్లలకు సాయం చేస్తా



విద్యార్థినులను సత్కరిస్తున్న డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు : పేద పిల్లలు చదువుకునేందుకు సాయం చేస్తూనే ఉంటానని నేత్ర వైద్య నిపుణుడు వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి తెలిపారు. వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులు తమ ఆస్పత్రికి రావచ్చునని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డి మాట్లాడుతూ తొలి నుంచి పాఠశాల అభివృద్ధికి డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి కుటుంబం సాయం అందిస్తోందన్నారు. 1985లోనే ఈ పాఠశాల ఏర్పాటుకు డాక్టర్ కుటుంబం రూ.లక్ష విరాళం ఇచ్చిందన్నారు. టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు సాధించిన సోముల వెంకటరామశరణ్య (590), షేక్ నజహత్ నఫీస్ (571), కొడవెండ్ల మసూద్ (555) నగదు బహుమతులు, సర్టిఫికెట్లతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు లక్ష్మీనరసింహతోపాటు తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపండి

పోరుమామిళ్ల : మండలంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దారు గంగయ్యకు దళిత సంఘ నేత ముత్యాల చెన్నారాయుడు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూముల చేర్పులు, మార్పులు, చుక్కల భూముల ఆన్‌లైన్, ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేయడం, భూములకు హద్దులు చూపకపోవడం, చెరువు లోతట్టు, వంక పోరంబోకు, తిప్ప, కొండ భూములు పట్టాలు చేయడం, అన్నదమ్ముల భాగపరిష్కారాలల్లో రికార్డుల్లో తప్పుగా రాయడం, సాగులో ఒకరు ఉంటే మరొకరికి ఆన్‌లైన్ చేయడం, ఎస్సీ, ఎస్టీల భూములు అగ్రవర్ణాల వారికి ఆన్‌లైన్ చేయడం, తదితర సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఇదేకాక మండలంలో రైతులకు ఇప్పుడు వందల ఎకరాలు ఎలా వచ్చాయో తెలియడం లేదన్నారు. భూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారిని రోజుల తరబడి తిప్పించుకోవడం తప్పితే పరిష్కారం చూపడం లేదన్నారు. రేషన్‌కార్డులో పేరు మార్పు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ల విషయంలో సిబ్బంది పలకడం లేదన్నారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ అన్ని సమస్యలు క్రమంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాజశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



అట్లూరు : వైద్య సిబ్బందితో సమావేశమైన అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించడంలో జాగ్రత్త అవసరమని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే ఈ నెల 26 నుంచి జూలై 16వ తేది వరకు జరుగనుంది. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్య, ఆశా, వాలంటీర్లకు మంగళవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై శిక్షణ

బి.కోడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు మండలంలోని 10 సచివాలయాల పరిధిలోని 40 గ్రామాల్లో సర్వే చేసి అనుమానిత కుష్టు వ్యాధి కేసులను గుర్తిస్తామన్నారు. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలోని ఇళ్లను సర్వే చేయాలన్నారు. స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చర్మపై బుడిపెలు, చేతివేళ్ళు, కాలివేళ్లపై స్పర్శలేనివారు, కనురెప్పలు మూతపడని వారు, కాళ్లు, చేతులపై పుండ్లు మొదలైన లక్షణాలు ఉన్న వారి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు సర్వే వివరాలను లెప్రసీ నోడల్ అధికారి విలియంకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షకులు విలియం, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలుంటే పరీక్ష చేయించుకోవాలి

రాజుపాళెం : గ్రామాల్లో ఎవరికైనా శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నిఖిల అన్నారు. రాజుపాళెంలోని పీహెచ్‌సీ ఆవరణంలో ఉన్న సమావేశం మందిరంలో మంగళవారం మండలంలోని ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై రాగి రంగు కలిగిన మచ్చలు, పొడలు ఉంటాయన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించాలని, తమ సిబ్బందికి గ్రామస్తులు సహకరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు శివశంకర్‌రెడ్డి, రవిశంకర రాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి గుర్తింపుపై శిక్షణ

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేపై డాక్టర్ సమీర ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనిచేసే ఆశా కార్యకర్త, మగ వలంటీర్ ప్రతి ఇంటికి వెళ్లి కుష్టువ్యాధి గ్రస్తులను త్వరితగతిన గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని తెలిపారు. కుష్టువ్యాధి లక్షణాలైన చర్మంపై స్పర్శ లేని పొడలు కలిగి ఉంటే ఈ పొడలకు నిర్ధారణ పరీక్షలు చేసి కుష్టువ్యాధి ఉన్నది లేనిది తెలుపుతారన్నారు. చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వికసిత, రోషిణి, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

అట్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ హమీదా బేగం పేర్కొన్నారు. శరీరంపై పాలిపోయిన రాగిరంగులో చెమటపట్టని పొడ ఉంటే కుష్టు వ్యాధిగా పరిగణించి అలాంటి వారిని ఆరోగ్యకేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు చేయించాలని ఆమె పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగా నిర్ధారణ అయితే వారికి ఉచితంగా వ్యాధి పూర్తిగా నయం అయ్యేంత వరకూ ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ మురళీ కృష్ణా, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శివాలయంలో యోగా తరగతులు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఏసీ శంకర్ బాలాజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేప మండపంలో బుధవారం నుంచి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోయి ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. బుధవారం ఉదయం మున్సిపల్ వైస్‌చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి యోగ తరగతులను ప్రారంభిస్తారని తెలిపారు. యోగా మాస్టర్లు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. దేవాదాయశాఖ ఏసీ, ఆలయ ఈఓ శంకర్ బాలాజీ మాట్లాడుతూ వేద పాఠశాల బిల్డింగ్ మూడు నెలల్లో పూర్తవుతుందన్నారు. అలాగే ఆలయంలో గోకులం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వెంకటసుబ్బయ్య, మహేశ్వరశర్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఓడినా.. గెలిచినా కార్యకర్తలు, ప్రజలే నా బలం

- లోకేష్ విమర్శలు అర్థరహితం
- చంద్రబాబు కంటే సీనియర్‌ను
- రైతాంగం, ప్రజల శ్రేయస్సు కోసమే పని చేస్తున్నాను
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చాపాడు : నియోజకవర్గంలో 64 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన మా కుటుంబం నాటి నుంచి ప్రజా సేవ చేస్తూనే ఉంది. 1970 నుంచి తన మొదలైన తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో గెలుపోటములను చవిచూశాను. ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, వైఎస్ జగన్ పరిపాలనలో అధికార పక్ష, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పని చేశాను. గెలిస్తే పొంగిపోనని.. ఓడితే కృంగిపోనని.. గెలిచినా.. ఓడినా తన బలం కార్యకర్తలు, ప్రజలే. తన రాజకీయ జీవితం ముగిసేంత వరకూ నియోజకవర్గ ప్రజలకు మంచి చేస్తూనే ఉంటానని సీనియర్ రాజకీయ నాయకులు, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి జీవిత చరిత్రపై రచించిన 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తకాన్ని మంగళవారం స్థానిక కొట్టి కళ్యాణ మండపంలో అన్ని వర్గాల అధిరథులచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన రాజీయ జీవితంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1959లో తన పెదనాన్న నాగిరెడ్డి మైదుకూరు ప్రెసిడెంటు గెలుపొందటం నుంచి తమ కుటుంబ రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. 1970లో ప్రొద్దుటూరు సమితి ప్రెసిడెంటుగా తాను మొదటి సారిగా పోటి చేసి రెండు ఓట్ల తేడాతో ఓటమి చెందినా.. అప్పటి నుంచే ప్రజా సేవ చేయటం ప్రారంభించానన్నారు. తర్వాత సమితి ప్రెసిడెంటుగా గెలుపొంది మంచి కార్యక్రమాలు చేసేందుకు శ్రీకారం చుట్టానన్నారు. 1983-85లో టీడీపీలో చేరి ఎన్టీఆర్‌ను ఒప్పించి నియోజకవర్గం సాగునీటి కోసం ఎస్సార్-1, 2 సబ్సీదరి రిజర్వాయర్లను నిర్మించేలా కృషి చేశారన్నారు. అనంతరం 1985లో ఎమ్మెల్యేగా గెలుపొందాక బ్రహ్మంసాగర్ నిర్మించాలని తాను, బద్వేలు ఎమ్మెల్యే వీరారెడ్డి పట్టుబడితే ఎన్టీఆర్ నిర్మాణం మొదలుపెట్టారన్నారు. అనంతరం చంద్రబాబు పాలనలో నిర్మాణం ఆగిపోయిందని 1999-2004 వరకూ బ్రహ్మంసాగర్ పూర్తి చేయాలని చంద్రబాబును కోరితే డబ్బులు లేవన్నారన్నారు. తర్వాత 2004లో వైఎస్ ముఖ్యమంత్రి కాగానే బ్రహ్మంసాగర్ పూర్తి చేయాలని కోరగానే టీడీపీ వర్గీయులం అయినప్పటికీ రెండేళ్లలో నిధులు కేటాయించి యుద్ధప్రాదిపతిక నిర్మాణం పూర్తి చేశారన్నారు. 2014-19లో చంద్రబాబు పాలనలో మైదుకూరు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, 2019 నుంచి మైదుకూరులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చెందుతోందన్నారు.

లోకేష్ విమర్శలు అర్థరహితం

లోకేష్ విమర్శలకు ప్రజలు నవ్వుకుంటున్నారు.. నాడు, నేడు ఇద్దరి ఆస్తులు ఎంత.. ఇటీవల మైదుకూరులో లోకేష్ ఏమీ తెలియకుండా నాపై విమర్శలు చేశారు. సమితి ప్రెసిడెంటు, 4 సార్లు ఎమ్మెల్యేను, మా పెదనాన్న రెండు సార్లు ఎమ్మెల్యే.. అని తాము రాజకీయాల్లో రాక ముందు వచ్చిన తర్వాత తమ ఆస్తులు ఎంత, చంద్రబాబు రాజకీయాల్లోకి రాక ముందు వచ్చిన తర్వాత ఆస్తులు ఎంతో.. ఎవరి కుటుంబం గొప్పదో తెలుసుకోవాలన్నారు. సర్పంచ్‌గా కూడా గెలువని లోకేష్ దొడ్డిదారిలో మంత్రి అయ్యారరన్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా లోకేష్ చేస్తున్న విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపీపీలు లక్షుమయ్య, జయచంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, సిద్దిక్, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, పీవీ రమణారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.